క్లుప్తంగా

ముత్యాలమ్మకు పొంగళ్లు



విశేషాలంకరణలో అమ్మవారు

చంద్రగిరి : రాయలవారికోటలో వెలసిన ముత్యాలమ్మతల్లికి మంగళవారం గ్రామస్తులు పొంగళ్లు సమర్పించారు. జాతరలో భాగంగా అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. మూలమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆపన్నహస్తం కోసం వినతి



మాట్లాడుతున్న నిర్మల

తిరుపతి అర్బన్ : 'మాది పేద కుటుంబం..నా భర్త మృతి చెందారు. ఈ ఏడాదిలో నాకు మూడు సార్లు ఆపరేషన్లు చేశారు.. కూటికి జరగడం కూడా కష్టంగా ఉంది. దయగలవారు ఆపన్నహస్తం అందించండి' అంటూ సప్తగిరినగర్‌కి చెందిన నిర్మల అనే మహిళ విన్నవించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆరోగ్యసమస్యలతో పలు అవయవాలు దెబ్బతిన్నాయని వెల్లడించారు. గత మూడేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఏడు ఆపరేషన్లు చేయించుకున్నానని చెప్పారు. అందులో ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు మూడు ఆపరేషన్లు అయ్యాయనివివరించారు. ప్రస్తుతం తన కుమారుడే సేవ చేస్తున్నాడని తెలిపారు. అద్దె కట్టలేకపోవడంతో ఇళ్లు ఖాళీ చేయించారని, బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆలయాల వద్ద తలదాచుకుంటున్నామన్నారు. మందులు, ఆహారం కోసం దాతలు సాయం చేయాలని కోరారు. ఈ నంబర్లలో 7816030920, 9177306011 తమ ను సంప్రదించి చేయూతనందించాలని విన్నవించారు.

ఐటీఐ కళాశాలకు ఆర్‌ఓ ప్లాంట్



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు ఆర్‌ఓ వాటర్ ప్లాంటును మంగళవారం వితరణగా అందించారు. శ్రీసిటీలోని ఆస్ట్రో టెక్ స్టీల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ తమ సీఎస్‌ఆర్ నిధుల కింద ఆర్‌ఓ వాటర్ ప్లాంటు, వాటర్ కూలర్‌ను అందించింది. సంస్థ చైర్మన్, ఎండీ అరుణ్ మిరండ, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జైసన్ జోసెఫ్, ప్రిన్సిపల్ పి.గణేష్ పాల్గొన్నారు.

గుజిరి వ్యాపారులకు వేధింపులు



మాట్లాడుతున్న ఎన్‌డీ రవి

తిరుపతి కల్చరల్ : నగరంలో గుజిరి వ్యాపారులను పోలీసులు వేధిస్తున్నారని ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్‌డీ రవి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో గుజిరి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. రవి మాట్లాడుతూ పోలీసులు తరచూ దాడులు చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. నిరుపేద గుజిరి వ్యాపారులకు ఇంటి స్థలాలు, గుర్తింపు కార్డులను ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గుజిరి వ్యాపారుల సంఘం జిల్లా కన్వీనర్ అల్లాబక్షు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన తిరుపతిలో నిర్వహించే జిల్లా మొద టి మహాసభలో సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి పోరాటం చేయనున్నట్లు వెల్లడించా రు. కార్యక్రమంలో నేతలు చిన్నం పెంచలయ్య, కేవై రాజా, పురుషోత్తం, మహేంద్ర, పద్మనాభ రెడ్డి, బలరాం, నాగభూషణ్, ఆర్.బాలన్, రాము, శ్రీరాములు, శుకుర్, బాలాజీ, మురళి, మహబూబ్ భాషా, సుభహన్, గురప్ప పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో మంత్రి అనగాని సత్యప్రసాద్, సినీ నిర్మాత సూర్యదేవర నాగవంశీ, ఏపీ అసెంబ్లీ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్, కమిటీ సభ్యులు, తెలంగాణ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



వేయికళ్లు.. మరు పొంగళ్లు!

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. జాతర ముగిసిన తర్వాత నాలుగో మంగళవారం సందర్భంగా మరు పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ క్రమంలో ఉదయం నుంచి రాత్రి వరకు శక్తిస్వరూపిణి దర్శనానికి బారులు తీరారు. తామర పుష్పాల అలంకరణలో సాక్షాత్కరించిన గ్రామదేవతను సేవించుకున్నారు. వేయికళ్ల దుత్తలను తలపై ధరించి ఆలయంలో ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అంబలిని భక్తిపూర్వకంగా పంపిణీ చేసి తరించారు. ఈ మేరకు రంగస్థలి కళాకారులు వివిధ వేషధారణలతో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. - తిరుపతి కల్చరల్



వివిధ వేషధారణలతో రంగస్థలి కళాకారులు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఏడాదిగా ఏడిపించేన్!

చంద్రబాబు మాయాజాలంలో ప్రజలు మరోసారి చిక్కుకున్నారు. ఎన్నికల సమయంలో వల్లించిన చిలక పలుకులకు బుట్టలో పడిపోయారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన నైజం బయటపడడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ప్రధానంగా సామాజిక పింఛన్ లబ్ధిదారులు ప్రతి నెలా ఇక్కట్లు పడుతున్నారు. ఎప్పుడు ఎవరి పేరు తొలగిస్తారో తెలియక బిక్కుబిక్కుమంటున్నారు. ఏడాదిగా కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులైన వారు కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. సర్కారు కరుణ కోసం రోజులు లెక్కపెట్టుకుంటున్నారు. నూతన పింఛన్ల సంగతి దేవుడెరుగు.. ఉన్నవాటినే తొలగించేస్తుంటే నిత్యం ఆందోళనకు గురవుతున్నారు.

- కొత్త పెన్షన్ల కోసం అర్హుల ఎదురుచూపులు
- మండిపడుతున్న 2,124 మంది దరఖాస్తుదారులు
- ఉన్న వాటినే తొలగించేందుకు సర్కారు జిత్తులు
- తిరుపతిలో ఇప్పటికే కోతకు గురైన 1,392 పింఛన్లు
- వృద్ధులు, దివ్యాంగుల, వితంతువులకు తప్పని తిప్పలు



తిరుపతి తుడా : తిరుపతి నియోజకవర్గ పరిధిలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు ప్రభుత్వం అందించే పింఛన్ సాయం కోసం ఎంతో ఆశగా పడిగాపులు కాస్తున్నారు. తిరుపతి పరిధిలో 2,124 మంది కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తులు చేస్తున్నారు. వీరికి 12 నెలలుగా ఎదురుచూపులే మిగిలాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సరిగ్గా ఏడాది పూర్తి చేసుకుంది. ఇప్పటివరకు ఒక కొత్త పింఛన్ కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవు. దీంతో దరఖాస్తుదారులు తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మించి సంక్షేమ పథకాలను అమలు చేస్తానని నమ్మబలికిన బాబు ఏడాదిగా కొత్త పింఛన్ ఇవ్వకపోగా, ఉన్నవాటికి కోతలు విధిస్తుండడంపై ప్రజలు భగ్గుమంటున్నారు. బాబును నమ్మి మోసపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో చంద్రబాబు హామీలకు వత్తాసు పలికిన పవన్ కల్యాణ్ ఏమైపోయాడంటూ దుమ్మెత్తి పోస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా...

కార్యాలయాలు ప్రజాప్రతినిధులు చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ 15 రోజుల్లోపే పింఛన్ మంజూరయ్యేది. వార్డు వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి వివరాలు తీసుకుని సచివాలయ సెక్రటరీ ద్వారా దరఖాస్తు చేసేవాళ్లు. అర్హత సాధించిన వెంటనే ఇంటికి వెళ్లి మంజూరు పత్రం అందించేవారు. గత ఐదేళ్ల పాలనలో అన్ని సాఫీగా సాగేవి. ప్రస్తుతం గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే వద్దకు వెళ్లి పింఛన్ బాబోయ్ అని మొత్తుకుంటున్నా కనికరించేవారు కరువయ్యారు. కార్యాలయాలు, పాలకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్న ఒక్క పింఛన్ మంజూరు చేయించలేకపోతున్నారు.

కోతలకు కుట్రలు

నిరుపేదలైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్లలో కోత పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపింది. దివ్యాంగులు ఇకపై పింఛన్ పొందాలంటే మరో మారు వెరిఫికేషన్ తప్పదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. గడిచిన నాలుగు నెలలుగా ప్రభుత్వాస్పత్రుల్లో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతోంది. మరో మూడు నెలల పాటు పింఛన్‌దారులను క్షుణ్ణంగా పరీక్షించి కొత్త సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. ఆ ప్రకారం పలువురి పెన్షన్లకు కోత విధించేలా ప్రభుత్వం ఎత్తులు.. జిత్తులు వేస్తోంది. పైగా బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని వంచించింది. దీనిపై పలువురు వెనుకబడిన వర్గాల వారు రగిలిపోతున్నారు. మరీ ఇంత మోసమా అంటూ చంద్రబాబుపై మండిపడుతున్నారు.

12 నెలలుగా ఇదే తంతు



ప్రభుత్వం కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో అర్థం కావడంలేదు. ఇప్పటికి 12 నెలలుగా ఇదే తంతు. ఈరోజు రేపు అంటూ వస్తున్నారు. ఏడాదిగా పింఛన్ లేకుండా అవస్థ పడుతున్నాం. ఇప్పటికే సచివాలయాల చుట్టూ తిరుగుతున్నాం. కొత్త పింఛన్ దరఖాస్తు చేసుకునేందుకు అనుమతి రాలేదంటున్నారు. పండుటాకులం ఏ పని చేసుకోలేకున్నాం. పింఛను వస్తే మందులు, మాత్రలకు ఉపయోగపడుతుంది. అదే ఆశతో జీవిస్తున్నాం. - సుబ్బరత్నమ్మ, తిరుపతి

50 ఏళ్లకే ఇస్తామని..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. ఏడాది పాలనలో ఒక్క కొత్త పింఛను ఇవ్వకపోవడం అన్యాయం. కూటమి ప్రభుత్వం మాటపై నిలబడాలి. బీసీలను వంచించడం సరైంది కాదు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోనే పింఛన్ మంజూరు అయ్యేది. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి మోసపోయాం.

- జి.సురేంద్ర, తిరుపతి

పోలీస్‌స్టేషన్.. పనిచేయని ఫోన్!



చంద్రగిరి : మీరు కాల్ చేస్తున్న నంబరు ప్రస్తుతం పనిచేయడం లేదు.. దయచేసి కాసేపు ఆగి తిరిగి ప్రయత్నించండి.. ఇది చంద్రగిరి పోలీసు స్టేషన్ నంబరుకు ఫోన్ చేస్తే వచ్చే సమాధానం. గత 6 నెలలుగా ఈ స్టేషన్‌లోని ల్యాండ్ నంబరు అందుబాటులో లేదు. దీంతో ఫిర్యాదుదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అర్ధరాత్రి ఏదైనా ప్రమాదం జరిగితే ల్యాండ్ లైన్‌కు ఫోన్ చేస్తున్నారు. సదరు నంబరు పనిచేయకపోడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. చంద్రగిరికి సమీపంలోనే పూతలపట్టు–నాయుడుపేట, తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారులు ఉన్నాయి. నిత్యం ఈ మార్గాల్లో ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. వీటితో పాటు పలు విద్యా సంస్థలు, కళాశాలలు సైతం ఈ స్టేషన్ పరిధిలో ఉన్నాయి. అందులోనూ సీఎం చంద్రబాబు సొంత మండలం కావడం విశేషం. అందుకే చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. ఇంతటి ప్రాధాన్యత గల స్టేషన్‌లో ఆరు నెలలుగా ల్యాండ్ లైన్ పనిచేయకపోవడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే గంజాయి, ఇసుక, మట్టి, ఎర్రచందనం తదితర అక్రమ రవాణాలపై పోలీసులకు సమాచారం అందించడం మండలవాసులకు కష్టతరంగా మారింది. సెల్‌ఫోన్‌కు కాల్ చేసి వివరాలు చెప్పాలంటే అందులో రికార్డు అవుతాయనే ఆందోళన సైతం ప్రజల్లో ఉంది. అక్రమార్కులకు తమ గురించి తెలిసిపోతుందనే కారణంతో పలువురు సెల్‌ఫోన్‌కు కాల్ చేసేందుకు తటపటాయిస్తున్నారు. ఈ క్రమంలో చంద్రగిరి పోలీస్‌స్టేషన్ ల్యాండ్ లైన్ నంబర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అందుబాటు ధరకే తుడా ప్లాట్లు



లేఅవుట్‌లను పరిశీలిస్తున్న తుడా చైర్మన్

తిరుపతి తుడా : పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా అందుబాటు ధరకే తుడా ప్లాట్లు విక్రయించనున్నట్లు తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రేణిగుంట మండలం సూరప్పకశంలోని పద్మావతి నగర్ తుడా లేఅవుట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. కమర్షియల్, రెసిడెన్షియల్‌కు కేటాయించిన ప్లాట్లను మ్యాపింగ్ ద్వారా అధికారులు వివరించారు. జంగిల్ క్లియరెన్స్ చేసి వీలైనంత త్వరగా మౌలిక వసతులు కల్పించి వేలానికి వెళ్లాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తుడా లేఔట్‌లో 270 ప్లాట్లు అమ్మకానికి ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్, ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసర్ సుజన, ఎస్‌ఈ కృష్ణారెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ దేవి కుమారి, జాయింట్ ప్లానింగ్ ఆఫీసర్ వాసుదేవరెడ్డి, ఈఈ రవీంద్రయ్య, డీఈ నరేష్ పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న బాధితులు, సీపీఎం నేతలు

తిరుపతి అర్బన్ : తిరుమల నగర్ పంచాయతీ వేణుగోపాల్‌కాలనీలో ఇళ్లు పోగొట్టుకున్న పేదలకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ఆర్‌డీఓ, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాల వద్ద బాధితులతో కలిసి సీపీఎం నేతలు ధర్నాకు దిగారు. నాగరాజు మాట్లాడుతూ 20 రోజుల క్రితం ఇళ్లు కూల్చివేసినా ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు నష్టం అంచనా వేయలేదన్నారు. ఇళ్లు కూల్చిన నిందితులపై కేసులు నమోదు చేయలేదని మండిపడ్డారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాధితులు వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, ఎం మాధవ్, మల్లికార్జునరావు, వెంకటేష్, శ్రీరాములు, రిషిరెడ్డి శివమణి, హరి, సురేష్, నాగమ్మ పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో శోభాయాత్ర



శోభాయాత్రలో కంచి పీఠాధిపతులు, ఎమ్మెల్యే తదితరులు

తిరుపతి కల్చరల్/తిరుపతి అన్నమయ్యసర్కిల్: జగద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి జయంతిని పురస్కరించుకుని కంచిమఠం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో శోభాయాత్రను భక్తిప్రపత్తులతో చేపట్టారు. కపిలతీర్థం నుంచి అన్నారావు సర్కిల్ మీదుగా వినాయ నగర్ క్వార్టర్స్ వద్ద కంచి మఠం వరకు యాత్ర నిర్వహించారు. కంచి మఠం పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి, సత్య చంద్రశేఖర శంకరాచార్యులు శోభాయాత్రలో సాగుతూ ప్రజలకు ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులు పాల్గొని ఆశీస్సులు తీసుకున్నారు. మొగిలి స్వామి పాణ్యం శ్రీనివాస శర్మ, కంచిమఠం మేనేజర్ శ్రీధర్, ఏపీ బ్రాహ్మణ సంఘాల సమాఖ్య రాష్ట్ర యువజన అధ్యక్షుడు వేదం హరిప్రసాద్, పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రామమూర్తి, కుమార్ శర్మ, రాజేష్, మహేష్, రామభద్ర పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- మహతి ఆడిటోరియంలో ఉదయం 11 గంటల కు స్విమ్స్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం.
- శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర కలశాభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు తిరుచ్చిపై సీతా రామలక్ష్మణులు ఊరేగింపు.
- అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు నిరంతర ఉపనిషత్తుల సందేశంపై వ్యాఖ్యానం.
- అలిపిరి పోలీస్ స్టేషన్ ఎదురుగానున్న కేబీఆర్ ఫంక్షన్ హాల్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చేతులమీదుగా కేంద్ర ప్రభుత్వ పథకాల ఎగ్జిబిషన్ ప్రారంభం, మధ్యాహ్నం 1 గంటలకు మీడియా సమావేశం, 3 గంటలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో మొక్కలు నాటే కార్యక్రమం.
- జిల్లాలోని పలు కేంద్రాలలో ఉదయం 9 నుంచి 10.30 వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు మూడు సెషన్లలో ఏపీ పీజీ సెట్ పరీక్షలు.
- జిల్లాలోని 8 కేంద్రాలలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు.
- పుదిపట్ల రామకృష్ణ మందిరంలో సాయంత్రం 6.30 గంటలకు శతావధాని ఆముదాల మురళి నేతృత్వంలో శ్రీమద్భాగవత సప్తాహం.
- తిరుచానూరు పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా పుష్కరిణిలో రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు తెప్పపై అమ్మవారి విహార.
- అప్పలాయిగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం మోహినీ అవతారంలో పల్లకి సేవ, రాత్రి గరుడ వాహన సేవ.

హిందూ ధర్మానికి విరుద్ధంగా కేటాయింపు



మాట్లాడుతున్న హిందూ సంఘాల జేఏసీ నేతలు

తిరుపతి కల్చరల్ : హిందూ ధర్మానికి విరుద్ధంగా టీటీడీ కల్యాణమండపం కేటాయించడం దారుణమని తిరుపతి హిందూ సంఘాల జేఏసీ నేత కిరణ్‌కుమార్ మండిపడ్డారు. హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరించే బ్రహ్మకుమారి సంస్థల కార్యక్రమాలకు నాగలాపురంలో టీటీడీ కల్యాణ మండపం కేటాయించడం దారుణమన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. దేవతా విగ్రహాలను పూజించరాదని, భర్తను భార్య అన్నా అని, భార్యను భర్త అక్క అని సంబోధించాలని హిందూ ధర్మానికి విరుద్ధంగా బ్రహ్మకుమారీ సంస్థ నిత్య ప్రచారం సాగిస్తోందన్నారు. హిందూ దేవతలను జంతువులుగా పోలుస్తోందని ఆరోపించారు. అలాంటి సంస్థకు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు కల్యాణ మండపం కేటాయించడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని టీటీడీ అధికారులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రమాదేవి, సురేష్, వేణు పాల్గొన్నారు.

జీఓ 21 రద్దుకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : ఆటో మోటార్ కార్మికులకు అన్యాయం చేసే జీఓ 21ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తిరుపతి నగర కార్యదర్శి పి.వెంకటరత్నం డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా, అమలు కావడం లేదని మండిపడ్డారు.రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి తుంగలో తొక్కేశారని ఆరోపించారు. ఆటో, క్యాబ్, లారీ, ట్రక్కు, ఇతర వాహనాల డ్రైవర్లు అందరికీ ఏటా రూ.15వేలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతలు కుడుం విజయ్‌కుమార్, పి.లోకేష్, మునికుమార్, చిరంజీవి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఆక్రమణపై ఆందోళన



కబ్జా భూమిలో నిరసన తెలుపుతున్న నేతలు, స్థానికులు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ పరిధిలోని ఆక్రమిత భూముల్లో అక్రమ కట్టడాలను వెంటనే నిలుపుదల చేయాలని స్థానికులతో కలిసి వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం ఆందోళనకు దిగారు. స్టాఫ్ క్వార్టర్స్ సమీపంలోని ఆక్రమిత భూమిలో నిరసన తెలిపారు. కబ్జాదారులకు సహకరించే రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.20 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే తహసీల్దారు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆరోపించారు. పేరూరు వీఆర్‌ఓ సైతం పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఆ భూమిని పేరూరు ప్రజల అవసరాలకు వాడాలని సూచించారు. గతంలో దళితవర్గానికి చెందిన ఓ మాజీ ఎంపీ ఈ భూమిని కాజేయాలని యత్నిస్తే చంద్రబాబు అడ్డుకున్నారని, ఇప్పుడు అగ్రకులానికి చెందిన వారు కబ్జా చేస్తే ఎందుకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సర్వే నంబరు 529/4ఎలోని 0.98 సెంట్లు భూమి ఆన్‌లైన్ అడంగల్‌లో నేటికీ అనాధీనంగానే ఉందని, అసలు ఈ భూమి ఎవరిదో తహసీల్దారు వెల్లడించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సర్పంచ్ దామినేటి కేశవులు, ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు చెంచుమోహన్ యాదవ్, సి.ప్రసాద్, మునీశ్వరరెడ్డి, సెల్వం, జయకర్, లక్ష్మీనారాయణ, ఉమాపతి, మల్లారపు వాసు, తుంటి సుధాయాదవ్, ముచ్చేలి కిరణ్‌కుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, రాజాయాదవ్ పాల్గొన్నారు.